క్లుప్తంగా

అడివెంల అంగన్‌వాడీలో పోషణ్ అభియాన్



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అర్వపల్లి : అడివెంల గ్రామంలోని 2, 3వ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, పోషకాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శతకోటి కళమ్మ, శతకోటి సరోజ, ఆయాలు పేరెల్లి రేణుక, సావిత్రమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

అనంతగిరి : దేశవ్యాప్తంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అన్ని హిందూ దేవాలయాల్లో నిర్వహిస్తున్నట్లు హరిహర అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ కొండపల్లి వాసు శనివారం ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఏడు గంటల నుంచి ఎనిమిదిగంటల వరకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో మొదటి సారి లోక కల్యాణార్థం హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టామని, తిరిగి మరోసారి హనుమాన్‌చాలీసా పారాయణం చేపడుతున్నట్లు తెలిపారు.

ఎన్‌ఎస్‌యూఐ గ్రామశాఖ అధ్యక్షుడిగా చల్ల శ్రీను



నూతన కమిటీ సభ్యులు

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఎస్‌యూఐ నూతన కమిటీని ఆ సంఘం మండల అధ్యక్షుడు కూజ ఎల్లేష్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా చల్ల శ్రీను, ఉపాధ్యక్షుడిగా మెరుగు మహేష్, కార్యదర్శిగా గంగాధరి హరీష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా జటంగి లింగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ నాయకులు కొండగడుపుల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్యామ్, అనిల్, లింగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా యాదగిరి



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలక మండలిని శనివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహించారు. గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా పెద్దపల్లి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి శంకర్, కార్యదర్శిగా గోడదాటి సైదులు, డైరెక్టర్లుగా నంగునూరు మంగమ్మ, మేడబోయిన యాదమ్మ, నంగునూరు ప్రకాష్, నంగునూరు శ్రీనివాస్, నర్ల నరేష్, నంగునూరు సత్తయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారికి ఎన్నికల అధికారి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి రామచంద్రయ్య, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామపంచాయతీ ఆవాస తండాలు పడమటితండా, తూర్పుతండాల్లో శనివారం ఆరాధ్యఫౌండేషన్ నూతన కమిటీలను నియమించారు. పడమటితండా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అంగోతు అనిల్, గోపి, ప్రధాన కార్యదర్శిగా మోహన్, తూర్పుతండా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బానోతు శ్రీకాంత్, గుగులోతు శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కేలోతు రాజు నియమితులయ్యారు. నూతన కమిటీల సభ్యులను ఆరాధ్యఫౌండేషన్ మండల అధ్యక్షుడు బైరబోయిన సైదులు, ఫౌండేషన్ ఎస్టీసెల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోతు జైపాల్‌నాయక్ కండువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుగులోతు శ్రీకాంత్, రాములు, ధర్మ, జగన్, రాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులు

తండాల రహదారులకు నిధులు

- తిరుమలగిరి మండలానికి రూ.7.15 కోట్లు మంజూరు
- జాజిరెడ్డిగూడెం మండలంలోని తండాలకు రూ.3 కోట్లు
- బీటీలుగా మారనున్న మారుమూల గ్రామాల రోడ్లు



తిరుమలగిరి : జేత్యా తండా మట్టి రోడ్డు



అర్వపల్లి : తూర్పుతండా రోడ్డు



అర్వపల్లి : గన్నెనాయక్‌తండా రోడ్డు..

తిరుమలగిరి, అర్వపల్లి : తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం మండలాల్లోని పలు తండాల రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా తండాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని ఎంతోకాలంగా గిరిజనులు చేస్తున్న పోరాటం ఫలించింది. ఆయా తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం జరుగనుండడంతో ఎన్నో ఏళ్లుగా గిరిజనులు పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి.

తిరుమలగిరి మండల పరిధిలో..

తిరుమలగిరి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా 8 గ్రామ పంచాయతీలు గిరిజన ఆవాస ప్రాంతాలే. కానీ ఆ తండాలకు రోడ్లు సరిగాలేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.7.15 కోట్లు మంజూరు చేసింది. తిరుమలగిరి మండలంలో మల్రికుంట తండా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.10 కోట్లు, భోక్యానాయక్ తండాకు రూ.90 లక్షలు, జలాల్‌పురం నుంచి గుండ్లబండ తండాకు రూ.2.25 కోట్లు, రాజానాయక్ తండా నుంచి తుమ్మలకుంట తండాకు రూ.1.25 కోట్లు, మామిడాల నుంచి జేత్యా తండా వరకు రూ.65 లక్షలు మంజూరయ్యాయి.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

జాజిరెడ్డిగూడెం మండలంలోని తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి గానూ రూ.3కోట్లు మంజూరయ్యాయి. కాసర్లపహాడ్-కొమ్మాల పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తూర్పుతండా వరకు 2.50 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి, కాసర్లపహాడ్-తూర్పుతండా మధ్య చెరువు వద్ద వాగులో కల్వర్టు నిర్మాణాలకు రూ. 2.10కోట్లు, అలాగే కొమ్మాల పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గన్నెనాయక్‌తండాకు కిలోమీటర్ రోడ్డు బీటీకి రూ. 89.10 లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆయా తండాల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఇబ్బందులు తీరుతాయి



జేత్యానాయక్ తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.65 లక్షలు మంజూరయ్యాయి. వానా కాలంలో ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం స్పందించి మా తండాకు బీటీ రోడ్డు మంజూరు చేసింది. రోడ్డు పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- దరావత్ మహేష్, రాఘవపురం, సర్పంచ్

నిధుల మంజూరు హర్షణీయం



మారుమూల తండాలైన తూర్పుతండా, గన్నెనాయక్‌తండాల రోడ్ల బీటీకి నిధులు మంజూరు కావడం హర్షణీయం. రూ.3 కోట్లు మంజూరు కావడంతో త్వరలోనే తండాలకు బీటీ రోడ్ల సౌకర్యం కలుగనుంది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న గిరిజనుల కష్టాలు తీరనున్నాయి.

- లూనావత్ స్వాతిరవీందర్‌నాయక్, సర్పంచ్

రాజీ మార్గంలో పరిష్కారం ఉత్తమం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శాలిని

తుంగతుర్తి : లోక్ అదాలత్‌ను ఉపయోగించుకొని కక్షిదారులు రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ఉత్తమం అని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాచర్ల శాలిని అన్నారు. జాతీయ లోక్ అదాలత్ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లోక్‌అదాలత్ ద్వారా పరస్పర అవగాహనతో రాజీ పడడం వల్ల ఇద్దరు గెలిచినట్లేనని అన్నారు. శనివారం లోక్‌అదాలత్ ద్వారా 2,966 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ప్రజలందరూ గొడవలు పడకుండా కలిసిమెలిసి ఉండడం ద్వారానే సమాజంలో ప్రశాంతత నెలకొల్పబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు గుగులోత్ రాజారాం, ప్రతాప్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా కుమారస్వామి, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, రణధీర్, హరిచరణ్, చంద్రమౌళి, సతీష్, పూల్సింగ్‌నాయక్, నాగరాజు, వజీర్, రవికుమార్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తులు



దరఖాస్తు చేసుకుంటున్న బొల్ల కరుణాకర్



దరఖాస్తు చేస్తున్న మల్లెపాక సాయిబాబా

దురాజ్‌పల్లి : సూర్యాపేట అసెంబ్లీ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి బొల్ల కరుణాకర్ దరఖాస్తు చేసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో తన దరఖాస్తును అందించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

తుంగతుర్తి : భారతీయ జనతా పార్టీ తుంగతుర్తి అసెంబ్లీ అభ్యర్థిగా మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు నరేష్, నాగరాజు ఉన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్, పాల్గొన్న ఎంపీ బడుగుల

తిరుమలగిరి : రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం తిరుమలగిరిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో తుంగతుర్తి నియోజకవర్గం రేషన్ డీలర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్ క్వింటాళ్‌కు రూ.70 నుంచి రూ.140 పెంచిందని తెలిపారు. రేషన్ డీలర్లకు ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల్లో కూడా రేషన్ డీలర్లకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అనంతరం రేషన్ డీలర్లు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, రేషన్ డీలర్లు ఉప్పలయ్య, మధుసూదన్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, వెంకటయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



నూతనకల్ : ప్రవళికను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహకారం

నూతనకల్ : నిరుపేద విద్యార్థి మొండికత్తి ప్రవళిక విద్యాభ్యాసం కోసం ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శనివారం ఆర్థిక సహకారం అందేశారు. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మొండికత్తి మల్లయ్య కుమార్తె ప్రవళిక నీట్ పరీక్షలో ర్యాంకు సాధించి మహబూబ్ నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందారు. కానీ ఆర్థిక స్తోమత లేకపోవడంతో చదువుకోవటం కష్టతరంగా మారిందని, దాతలు ఎవరైనా సహకారం అందించాలని కోరడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌కు విషయం తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.25వేల నగదును విద్యార్థిని చదువు నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, ఎంపీటీసీ గాజుల రజితలింగరాజు యాదవ్, అంజయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు



సూర్యాపేట రూరల్ : యూరియా పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి



ఆత్మకూర్ (ఎస్) : ఏపూరు పీఏసీఎస్ కేంద్రంలో యూరియా సరఫరాను పరిశీలిస్తున్న అధికారి

సూర్యాపేట రూరల్ : యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, సరిపోను యూరియా కొనుగోలు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని సహకార సంఘం, మండల పరిధిలోని ఎండ్లపల్లిలో ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 20 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జానిమియా, ఏఈఓ ముత్తయ్య, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా సరఫరా..

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని రైతులకు అవసరమైన యూరియాను ఎలాంటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఏపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి మాట్లాడారు. ఏపూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 296 బస్తాలు, నెమ్మికల్ గ్రామంలో 892 బస్తాల యూరియా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలోనూ ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఎప్పటికప్పుడు యూరియాను మండలంలోని ఆయా పీఏసీఎస్ కేంద్రాలకు పంపిస్తున్నామని తెలిపారు. రైతులు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి డి.దివ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ లక్ష్మారెడ్డి, సిబ్బంది రాము, శ్రీకాంత్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న అంజయ్య

తుంగతుర్తి : ఈ నెల 18 నుంచి జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ తూరుగంటి అంజయ్య మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 22 వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్వాయి బాలయ్య, కందుకూరి శ్రీను, కొండగడుపుల శ్రీను, పోలెపాక అంజయ్య, గంగరాజు, ఎర్ర రాములు, కొండేటి సైదులు, భానుప్రకాష్, కందుకూరు చంద్రయ్య, యాదగిరి, పాల్వాయి పరశురాములు, మధు, లక్ష్మీకాంత్, తరుణ్ పాల్గొన్నారు.

పిల్లలమర్రి శివాలయంలో ఆర్డీఓ పూజలు



ఆర్డీఓ వీరబ్రహ్మేంద్ర చారి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి శివాలయాన్ని ఆర్డీఓ వీరబ్రహ్మేంద్ర చారి దంపతులు శనివారం సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంశపారంపర్య అర్చకులు మునగలేటి సంతోష్‌శర్మ, ఉల్లెందుల లింగయ్యలు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కాళోజీ నారాయణరావుకు ఘన నివాళి



కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుడిపాటి సైదులు, తదితరులు

తుంగతుర్తి : ప్రజాకవి కాళోజీ నారాయణరావు అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడిపాటి సైదులు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి, తెలంగాణ భాష, సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రమేష్, నాయకులు గుండగాని రాములు, శ్రీనివాస్, ఉప్పుల నాగమల్లు, ఎనగందుల అఖిల్, సూరయ్య, బత్తుల జలంధర్, రవికుమార్, చెరుకు పరమేష్, సాయికిరణ్, ఎల్లయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

10నుంచి రైతాంగ పోరాట వారోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పెన్‌పహాడ్ : సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన నాటి తెలంగాణ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం అన్నారు. భూమి, భుక్తి, ప్రజల విముక్తి కోసం సామాన్యులు సైతం ఆయుధాలు పట్టుకొని దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. ఆదివారం అనంతారం క్రాస్ రోడ్డు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై సెప్టెంబర్ 17న చీదెళ్ల గ్రామానికి చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి, చినపంగి నర్సయ్య, మండల కమిటీ సభ్యులు మడ్డి అంజిబాబు, గుర్రం గోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి, రాములు, వెంకట్‌రెడ్డి, వెంకన్న, గోపి, గోపయ్య, శ్రీను, సైదులు, సంతోష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న జైగౌడ సంఘం నాయకులు

చివ్వెంల : జై గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని అబ్బులు గౌడ్ జన్మదినం సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఆలేటి ఆటం అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 67 మందికి అన్నదానం చేశారు. అదే విధంగా అనాథాశ్రమానికి వంటసామగ్రి, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రామగిరి నగేష్, జైగౌడ సంఘం నాయకులు రామన్న, విజయ్, నాగరాజు, వెంకన్న, రామలింగయ్య, ప్రవీణ్, వినోద్, వాసుదేవారెడ్డి, మహేష్, మనోహర్, రాజేష్, అకిల్, రవిరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ప్రతినెలా ఆదాయం



కోదూరులో మొక్కలు నాటుతున్న ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు

అర్వపల్లి : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగుచేసుకొని ప్రతినెలా ఆదాయం పొందవచ్చని పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ క్షేత్ర సహాయకుడు రంగు ముత్యంరాజు సూచించారు. కోదూరు గ్రామంలో శనివారం రైతు సామ అభిషేక్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ తోటలను సాగుచేసుకొని లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో రైతు సామ అభిషేక్‌రెడ్డి, డ్రిప్ కంపెనీ ప్రతినిధి పసల సైదులు, యాదగిరి, సోమయ్య, వెంకన్న, రవినాయక్ పాల్గొన్నారు.

ముగిసిన 41 రోజుల అగండ దీక్ష



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని బాలాంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో హనుమాన్ భజనమండలి భక్తులు 41 రోజులుగా నిర్వహిస్తున్న అగండ దీక్ష శనివారం ముగిసింది. వర్షాలు బాగా కురిసి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ అగండ దీక్ష చేపట్టినట్లు భజనమండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అగండాన్ని చేతబట్టుకొని భజనలు చేసుకుంటూ వీధుల్లో ఊరేగింపు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింగ నాగమ్మ, పజ్జూరి మోహన్‌రెడ్డి, నిమ్మల మల్లయ్య, నర్సింగ యాదయ్య, జె.నరేష్, ఎన్.కృష్ణ, ఎన్.నాగరాజు, జి. సోమలింగం, ఎన్.పాపయ్య, ఎస్.వీరయ్య, పాపయ్య, కె.శంకరయ్య, నర్సింగ కృష్ణమూర్తి, కీర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు మోత్కూరి శంకరశాస్త్రి, ప్రవీణ్ నిర్వహించారు.

11న వర్ధంతి సభ

తిరుమలగిరి : సెప్టెంబర్ 11న నిర్వహించే దుబ్బాక సంజీవరెడ్డి 25వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. శనివారం తిరుమలగిరిలో వర్ధంతి సభ కర పత్రాలను ఆవిష్కరించారు. 11న నాగారం మండలం పసునూరులో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, రాములు, కరుణాకర్, నర్సయ్య, రేణుక, జయమ్మ, సుధాకర్, మోహన్, విజయ్‌రెడ్డి, లతీఫ్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

'మావో స్ఫూర్తితో ఉద్యమాలు తీవ్రతరం చేద్దాం'



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : మార్క్సిస్టు మావోపాధ్యాయుడు మావో స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మావో 47వ వర్ధంతి సందర్భంగా న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటా నాగయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, కారింగుల వెంకన్న, కంచనపల్లి సైదులు, దేసోజు మధు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న దరూరి యోగానందచారి

అర్వపల్లి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నారు. కొమ్మాలలో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కాసర్లపహాడ్, కొమ్మాల గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు నర్ర సురేష్, మేడి నర్సయ్య, బందెల వెంకన్న, మేడి కళ్యాణ్, శ్రీను, మురళి, వెంకన్న, మచ్చ కృష్ణ, గుడిసె నర్సయ్య, బొబ్బలి యాదగిరి, చెరుకు రాజు, దిర్శనపు శ్రీనుతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, సర్పంచ్ గుయ్యని బాబు, దాసరి సోమయ్య, బాకు మల్లయ్య, ఎల్లంల కొమిరెల్లి, దిర్శనపు యాదయ్య, రత్నం లక్ష్మాజీ, సంతోష్, బైరబోయిన మహారాజు, మందడి పూర్ణచంద్రారెడ్డి, రమావత్ శేఖర్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు పాటుపడాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కరుణశ్రీ

నూతనకల్ : హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటుపడాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్‌లో నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో స్వయం కృషి సొసైటీ స్వచ్ఛంద సంస్థ వారు శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ నిమిత్తం హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వయం కృషి సొసైటీ సభ్యులు, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మదర్ థెరిస్సా అంతర్జాతీయ అవార్డుకు ముగ్గురు ఎంపిక

మిర్యాలగూడ టౌన్: మదర్ థెరిస్సా అంతర్జాతీయ అవార్డుకు మిర్యాలగూడ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఈమేరకు ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ మెనేజ్‌మెంట్ శనివారం పోస్టు ద్వారా ఆహ్వానం పంపింది. ఫెయిత్ బంజారా అనాథాశ్రమం నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్, ధీరావత్ రమాబాయిలు కుష్ఠు రోగులు, వృద్ధులకు చేసిన సేవలకుగాను, అదే విధంగా ధీరావత్ సుధారాణి అందించిన వైద్య సేవలకుగాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డులను ఈ నెల 30న న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు హన్యానాయక్ తెలిపారు.

20 అడుగులకు చేరిన డిండి ప్రాజెక్టు నీటిమట్టం

డిండి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దుందుబి వాగు పరవళ్లు తొక్కుతుండటంతో డిండి ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 20 అడుగుల వరకు నీరు చేరింది. ప్రాజెక్టులోకి 900 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ ఏఈ ఫయాజ్ తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడు ధర్మారెడ్డి మృతి


ధర్మారెడ్డి(ఫైల్)

హిమాయత్‌నగర్: స్వాతంత్య్ర సమరయోధుడు మండడి ధర్మారెడ్డి(97) మృతిచెందారు. శనివారం హైదరాబాద్‌లో దిల్‌షుక్‌నగర్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ధర్మారెడ్డి మనుమరాలు శ్రావ్యరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి స్వాతంత్య్ర ఉద్యమం సమయంలో కీలకపాత్ర పోషించారు. జాతిపిత మహాత్మ గాంధీ నేతృత్వంలో జరిగిన శాంతియుత పోరాటాల్లో ధర్మారెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో రాజాకార్ల దౌర్జన్యాల సమయంలో ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేశారు. ధర్మారెడ్డికి భార్య జానకమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చేనేత కార్మికుల ఆరోగ్య స్థితి, భద్రత పరిశీలన


చేనేతల ఆరోగ్య స్థితిగతులు, తదితర వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం

మోత్కూరు: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షీల నారాయణ బృందం, శేఖర్‌రెడ్డి, డాక్టర్ సంకు శంకర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినర్స్ బృందం శనివారం మోత్కూరులో చేనేత కార్మికుల వ్యక్తిగత ఆరోగ్య స్థితి, వృత్తిపరమైన భద్రతను పరిశీలించింది. ఈ సందర్భంగా మహిళా చేనేత కార్మికుల ఆరోగ్య స్థితి, సాధికారతపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల్లో పురుషులు 51 శాతం, మహిళలు 49 శాతంగా ఉన్నారని వారు తెలిపారు. వారి వెంట యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత మహిళా విభాగం సహాయ కార్యదర్శి రేగోటి ఉషారాణి ఉన్నారు.

సమ్మె సరైంది కాదు

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11వ తేదీ నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేయాలని భావించడం సరైంది కాదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగ సంఘాల జేఏసీ జనరల్ సెక్రెటరీ జ్యోతిపద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ సమ్మెలో భాగస్వామ్యం కావొద్దని సూచించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలను ఇబ్బంది పెట్టే ప్రక్రియకు చేపట్టవద్దని కోరారు. ఉద్యోగులతో సమానంగా పీఆర్సీ పెరిగినప్పుడల్లా అంగన్‌వాడీలకు 30 శాతం జీతం పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు.

ఎలియాస్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు


ఎలియాస్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాదె ఎలియాస్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఎలియాస్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎలియాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారన్నారు. పార్టీ పరంగా బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిశోర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, మహేష్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, అంథోనిరెడ్డి ఉన్నారు.

'జీ–20' సదస్సులో జిగేల్..

తేలియా రుమాల్

- ప్రాచీన చేనేత కళకు ప్రపంచ గుర్తింపు
- దేశం మొత్తంగా పుట్టపాక గ్రామంలోనే తేలియా రుమాల్
- వందేళ్ల క్రితమే ప్రకృతి రంగులతో తయారు
- చేనేత కళాకారులకు దక్కిన అత్యుత్తమ అవార్డులు


దారాలపై డిజైన్ వేస్తున్న యువకుడు

నల్లగొండ డెస్క్

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామం చేనేత కళాకారులు రూపొందించిన 'తేలియా రుమాల్' ప్రపంచ ఖ్యాతి గడించింది. జీ–20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన భారతీయ హస్తకళల ప్రదర్శనలో తేలియా రుమాల్‌కు చోటుదక్కింది. ఈ వస్త్రాలను సదస్సుకు వచ్చే విదేశీ ప్రతినిధులు కొనుగోలు చేసే అవకాశం ఉంది. తేలియా రుమాల్ అనేది ఒక రకమైన వస్త్రం. తేలియా రుమాల్.. పుట్టపాక ప్రత్యేకం. ఇక్కడి చేనేత కళాకారులు తమ కళా నైపుణ్యానికి పదును పెడుతూ, సృజనాత్మకతను వెలికి తీస్తూ, పోటీతత్వంతో అనేక కొత్త కొత్త డిజైన్లను రుపొందిస్తున్నారు. తేలియా రుమాల్ వస్త్రంతో పుట్టపాక అనే మారుమూల పల్లె చేనేత పరంగా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచింది. దాదాపు వంద సంవత్సరాల క్రితమే పుట్టపాక గ్రామంలో తేలియా రుమాల్ వస్త్రంతో నేసిన చేనేత ఉత్పత్తులు అరబ్ దేశాలకు ఎగుమతి చేసినట్లు ఇక్కడి చేనేత కళాకారులు చెప్పారు. తేలియా రుమాల్.. వేసవి కాలంలో చల్లగా, చలి కాలంలో వెచ్చగా ఉండడమే కాక సుగంధ వాసనలు వెదజల్లే ప్రత్యేకత కలిగి ఉంటుంది.

ప్రత్యేక గుర్తింపు

పుట్టపాక తేలియా రుమాల్ అనే వస్త్రంకు పోస్టల్ శాఖ అరుదైన గౌరవం ఇచ్చింది. తేలియా రుమాల్ అనే వస్త్ర తయారీ కళను పోస్టల్ శాఖ ప్టోసల్ కవర్‌తో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించింది. తేలియా రూమాల్‌కు భౌగోళిక గుర్తింపు(జీఐ) కూడా ఉంది.

పద్మశ్రీ అవార్డు సొంతం..

తేలియా రుమాల్ భారత దేశంలో మరెక్కడా నేయరు. దేశం మొత్తం మీద పుట్టపాక గ్రామంలోనే తెలియా రుమాల్ తయారు చేస్తారు. ఈ వస్త్రం నేసినందుకు పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత కళాకారులు గజం గోవర్ధన్, గజం రాములుకు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందజేసింది. దీంతో పాటు పలు జాతీయ అవార్డులు కూడా ఈ గ్రామ చేనేత కళాకారులకు వచ్చాయి.




తేలియా రుమాల్ వస్త్రం


మగ్గంపై తయారవుతున్న తేలియా రుమాల్ వస్త్రం

ధర ఇలా.. తేలియా రుమాల్ వస్త్రంతో తలపాగాలు, చీరలు, దుప్పటా, కార్ఫ్, డ్రెస్‌మెటీయల్‌తో పాటు ఇతర దుస్తులను తయారు చేస్తున్నారు. ఈ వస్త్రానికి మీటరు ధర కనిష్టంగా రూ.5 వేలు.. గరిష్టంగా రూ.25వేలు ఉంటుంది. చీరలు డిజైన్లను బట్టి రూ.30వేల నుంచి రూ.2 లక్షల వరకు ధర ఉంది. తేలియా రుమాల్ వస్త్రం తయారీకి ఎక్కువ రోజులే పడుతుంది. 60 మీటర్ల వస్త్రం తయారు చేయడానికి.. నూలు ప్రాసెస్ సమయం 21 రోజులతో పాటు అదనంగా నెల రోజులు పడుతుంది. ఒక చీర నేయడానికి.. నూలు ప్రాసెస్, రంగుల అద్దడం, ఆరబెట్టడానికి సమయం కలిపి మొత్తంగా మూడు నెలల సమయం పడుతుందని చేనేత కళాకారులు చెప్పారు. ఇవి ఎండా కాలం చల్లగా, చలికాలం వెచ్చగా ఉండడమే గాక సుగంధ వాసనలు వెదజల్లుతాయి.

తేలియా రుమాల్ తయారీకి వాడే ప్రకృతి రంగులివే..


గుమ్మడి రంగు తయారీ


నానబెట్టిన కరక్కాయ పొడి


గుమ్మడి రంగు: గుమ్మడి రంగు వేయడానికి.. అడవి పసుపు(పచ్చి పసుపు), తేయాకు, తమలపాకు కలిపి గుమ్మడి రంగును తయారు చేస్తారు.

తేలియా రంగు: సున్నపు రాయి, అడవి పసుపు, నువ్వుల నూనె, నిమ్మకాయ రసంతో కలిపి తయారు చేస్తారు.

ఇండిగో రంగు: ఇండిగో అనే మొక్కను ఉడకబెట్టి కేక్ మాదిరిగా మారుస్తారు. ఇండిగో మొక్కను చైన్నై నుంచి తీసుకువస్తున్నారు. సున్నం, కుంకుడు రసం, నిమ్మరసం కలిపి తయారు చేస్తారు.

నల్ల రంగు: పాత ఇనుప సామానును 25రోజులు నీటిలో నానబెట్టి తుప్పు పట్టిస్తారు. తాటిబెల్లం, ఇనుప తుప్పు, నల్ల కరక్కాయ పొడి, కుంకుడు రసం, నిమ్మ రసం కలిపి నల్లటి రంగుగా తయారు చేస్తారు.

ఇలా తయారు చేసిన రంగులతోనే ప్రాచీన తేలియా రుమాల్ వస్త్రంకు రంగులు అద్దుతారు.


ఆముదపు పొట్టు


గొర్రె ఎరువు


నువ్వుల నూనెలో శుద్ధిచేసిన దారాలు


నూలును ఆరబెడుతున్న చేనేత కళాకారుడు

ఎలా తయారు చేస్తారంటే..

పుట్టపాకలో నేసే ప్రాచీన తేలియా రుమాల్ వస్త్రాలకు ప్రకృతి రంగులే ఆధారం. తెల్ల దారానికి ప్రకృతి రంగులు గుమ్మడి రంగు, తేలియా రంగు, ఇండిగో, నల్ల రంగును ఉపయోగిస్తారు.

- మొదటగా తెల్ల దారానికి జిగురు తొలగించేందుకు గాను ఒక రోజు నీళ్లలో నానబెట్టి నీడలో ఆరబెడతారు. ఇలా వారం రోజులు కష్టపడి తెల్లధారానికి ఉన్న జిగురు తొలగిస్తారు.
- ఆ తర్వాత దారాన్ని శుద్ధి చేయడం కోసం కరక్కాయ పొడి కిలో ఒక్కంటికి 150 గ్రాముల చొప్పున, అల్లం 10గ్రాములతో కలిపి శుద్ధి చేస్తారు.
- ఇలా శుద్ధిచేసిన నూలును 21 రోజుల పాటు ప్రాసెస్ చేస్తారు. మొదట ఆముదపు పొట్టును కాల్చి బూడిద చేస్తారు. నువ్వుల నూనెతో బూడిదను కలిపి, నూలును అందులో ఉంచుతారు. రోజంతా నీటితో కలిపిన గొర్రె ఎరువులో నానబెడతారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నూలును ఉతికి శుభ్రపరిచి.. ఆరబెడతారు. మళ్లీ అందులోనే నానబెడతారు. ఇలా 21రోజులు చేస్తారు.
- ఆ తర్వాత వస్త్రం అవసరాన్ని బట్టి వార్పుపై అవసరమైనంత పొడవులో దారాలను తీస్తారు. మగ్గంపై కావాల్సిన తీరులో డిజైన్లతో కూడిన వస్త్రాన్ని రూపొందిస్తారు.


దారాలను శుద్ధి చేస్తున్న చేనేత కళాకారుడు

సమ్మె బాటలో అంగన్‌వాడీలు

- ఈ నెల 11 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు నోటీసులు అందజేత
- కేంద్రం తాళాలను ఇవ్వాలని సూచించిన సంబంధిత అధికారులు
- అంగన్‌వాడీలను పర్యవేక్షించాలని సూపర్‌వైజర్లకు ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 4,203 కేంద్రాలు

భువనగిరిటౌన్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ శాఖల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతకు సంబంధించి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నారు. ఈ సమయంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు కూడా ఈ నెల 11 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. అంగన్‌వాడీ టీచర్లు తమకు నెలకు రూ.26 వేల వేతనం ప్రకటించాలని, పదవీ విరమణ తరువాత రూ.లక్షకు బదులు రూ.10లక్షలు అందించాలని, తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. ఈమేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు.

ప్రభుత్వం స్పందించకుంటే..

యాదాద్రి భువనగిరి జిల్లాలో 901 అంగన్‌వాడీలు కేంద్రాలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 1,209 కేంద్రాలు, నల్లగొండ జిల్లాలో 2,093 కేంద్రాలు ఉన్నాయి. తాము అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడంతో పాటు ప్రభుత్వ చేపట్టే అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నామని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని పేర్కొంటున్నారు. కాగా.. యాదాద్రి జిల్లాలో ఉన్న 901 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 700 కేంద్రాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, సూర్యాపేట జిల్లాలోని 1209 కేంద్రాలకు గాను 900 కేంద్రాల వారు, అదేవిధంగా నల్లగొండ జిల్లాలోని 2,093 కేంద్రాలకుగాను 1,800 కేంద్రాల వారు సమ్మెలోకి వెళ్లనున్నారు.


అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహిస్తున్న సంక్షేమ శాఖ అధికారులు

హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెకు దిగితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆ శాఖ ఉన్నతాధికారులు, సీడీపీఓలు సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సమ్మెకు వెళ్లకుండా చూడాలని, ఒకవేళ వెళ్తే అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ఇచ్చి సమ్మెకు వెళ్లాలని ఆదేశించారు. వాటి పర్యవేక్షణ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పర్యవేక్షించి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ...


సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

- అంగన్‌వాడీల వేతనం రూ.26వేలుగా నిర్ధారించాలి.
- ఉద్యోగ విరమణ వయసును 60 ఏళ్లకు కుదించాలి.
- విరమణ పొందిన టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్శకు రూ.5లక్షలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ నాటికి తీసుకునే వేతనంలో సగం మేర పెన్షన్ ఇవ్వాలి.
- సీనియారిటీ ఆధారంగా వేతనాల పెంపుతోపాటు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ఐసీడీఎస్ పథకానికి నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలి.
- కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.

11 నుంచి సమ్మెలోకి వెళ్తాం



ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కాక టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అదనపు బాధ్యతలు పెంచి వేతనం తక్కువ ఇస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.26వేల వేతనం, రిటైర్మెంట్ కింద రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలి. ఈనెల 11నుంచి అనుముల ప్రాజెక్టు మొత్తం టీచర్లు, ఆయాలు నిరవధిక సమ్మెలో పాల్గొంటారు. చర్చలకు పిలువకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం.

– బూరుగు స్వప్న, యూనియన్ అధ్యక్షురాలు

సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల రిటైర్మెంట్ ప్యాకేజీ మోసపూరితంగా ఉంది. చర్చల సమయంలో ప్రకటించిన సాయం.. ఇప్పుడు నిర్ణయించిన సాయం సగానికి పడిపోయింది. ఆసరా పెన్షన్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదు. పదవీ విరమణ నాటికి తీసుకుంటున్న వేతనంలో సగం మేర పెన్షన్ రూపంలో ఇవ్వాలి. పని భారం పెరుగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్ల విధులను సర్దుబాటు చేయాలి.

– సీహెచ్, రామకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియర్ జిల్లా కార్యదర్శి

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తామని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. ఎన్నికల ముందు అన్ని బంధులు పెడుతున్నారని, ఔటర్ వద్ద భూములు అమ్మి అకౌంట్లలో జమచేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3 మాసాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 17న సోనియాగాంధీ వస్తున్నారని, హామీలు ఇస్తారని తెలిపారు.

మాదిగల పోరాటానికి న్యాయమైన ముగింపునివ్వాలి

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణకు మాదిగలు 29 ఏళ్లుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి న్యాయమైన ముగింపు పలకాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నల్లగొండ జిల్లా కందుకూరి సోమన్న దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి వచ్చిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మెమోరండం సమర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్ర అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి వర్గీకరణపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఎమ్మార్పీఎస్ దీక్షకు తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బోడ సునీల్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన దీక్షా కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మేడి శంకర్ మాదిగ, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీడిమెట్ల రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో-కన్వీనర్ ఎరిగి శ్రీశైలం మాదిగ, ఎంఎస్పీ నల్గొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ చిన్నమాదిగ, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమిరే స్వామి మాదిగ, మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడుసు సైదిస్, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలేని యాదయ్య మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జీడిమెట్ల రమేష్ ఎంఎస్పీ మండల అధ్యక్షులు, మహిళా సంఘం అధ్యక్షురాలు కూరపాటి కమలమ్మ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు వంగూరి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు మాసార వెంకన్న కత్తుల సన్నీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని ఎంపీని కోరుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు శనివారం ప్రాజెక్టు నాలుగు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ నుంచి 5,742 ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువలో ఉండడంతో నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా 5,230 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 379 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు కలిపి నుండి 5,742 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 644 (4.20 టీఎంసీల) అడుగుల వద్ద ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.


దిగువకు విడుదలవుతున్న వరదనీరు

నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఆదివారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. శనివారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా విరోచితంగా పోరాటం చేశారని, 4500 మంది బలిదానాలు చేశారని కాని, ఈ పోరాటాన్ని కొన్ని పార్టీలు స్వార్థం కోసం రాజకీయంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. వాస్తవానికి తెలంగాణ రాజ్యాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేశారని, దానిని వదిలేసి విముక్తి, విద్రోహం, విమోచనం పేరిట రాజకీయం చేస్తున్నారన్నారు. నాడు జరిగిన పోరాటాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వమే సెప్టెంబర్ 17న విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10వ తేదీన ఐలమ్మ వర్ధంతి నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో సాయుధ పోరాటంలో పాల్గొన్న వారిని వారోత్సవాల సందర్భంగా సన్మానించనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ మండలంలో గూడూరు, తడకమళ్ల, మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు, ఆగామోత్కూరు, వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామాల్లో వారోత్సవాల సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 17న నిర్వహించే భారీ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరెపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి ముదావత్ రవినాయక్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పిల్లుట్ల సైదులు, బాలాజీనాయక్, బాలునాయక్, వెంకట్‌రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి